epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

బుధవారం, హైదరాబాద్
25.06.2025

24 క్యారెట్లు 1,00.750 | కిలో వెండి 1,20,000 | 26 °C | సంపుటి:3 | సంచిక:178

www.vishalabharati.com

## మళ్లీ తెలంగాణకు ఆమ్రపాలి.. క్యాట్‌లో ఊరట



హైదరాబాద్: ఐఏఎస్ అధికారిణి కాటా ఆమ్రపాలికి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆమెను తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో తెలంగాణలో పనిచేసిన అమ్రపాలి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీవోపీటీ) ఉత్తర్వుల మేరకు ఇక్కడ రిలీవై ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ తనను తెలంగాణకే కేటాయించాలని ఆమె క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను అనుమతించిన క్యాట్ ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

### పల్లెల కడుపు నింపుతున్న ఉపాధి హామీ

- రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి
- గత రెండు నెలల్లోనే 4.54 కోట్ల పని దినాలు పూర్తి అయ్యాయి
- 6.50 కోట్ల పనిదినాలను కేటాయించిన కేంద్రం
- 70% పూర్తి చేసిన ప్రభుత్వం
- మిగిలిన 30శాతం ఈ నెలాఖరుతో పూర్తి

3

### బిల్లు లేకుండా ఫోన్ కొనకండి

- పోయిన సెల్ ఫోన్ ఆన్ కాగానే పట్టేస్తాం
- రాచకొండ సీపి సుధీర్ బాబు

4

### బెట్టింగ్ యాప్స్ ప్రమోటర్ల అరెస్ట్

- పరారీలో ప్రధాన నిందితులు
- సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయిశ్రీ వెల్లడి

3



# 16 ఏళ్లకే ప్రేమ.. తల్లిని చంపిన కూతురు!

*కన్నవాళ్లే కాలయములవుతున్నారు.. ప్రేమకు అడ్డొస్తున్నారని కన్న తల్లులనే కాటేస్తున్నారు.. ప్రేమ మోజులో పడి తల్లిని చంపేంత కాఠిన్యాన్ని నింపుకుంటూ..తమ ప్రియుడితో కలిసి హత్యలు చేస్తున్నారు. ఇందులో మైనర్లు, యువకులు, వయస్సు మళ్లిన వారు సైతం ఉండడం ఆందోళన కల్గిస్తోంది. ఇలాంటి వారు హత్యలు చేసేందుకు ఇంటర్‌నెట్‌లో యూట్యూబ్‌ను ఆశ్రయిస్తున్నారు.*

- హైదరాబాద్ నగరంలోని జీడిమెట్లలో దారుణం జరిగింది
- 10వ తరగతి చదువుతున్న బాలిక ప్రియుడితో కలిసి కన్నతల్లిని చంపేసింది
- ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది
- ప్రేమ వ్యవహారం తెలిసి తల్లి మందలించిందన్న కోపం
- తన ప్రియుడు, అతని తమ్ముడుతో కలిసి కూతురు కన్నతల్లినే చంపేసింది



2



### త్వరలో మరో 30 వేల ఉద్యోగాలు

- ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం కీలక అప్‌డేట్ ఇచ్చింది
- ఇప్పటికే 56 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పిన ఉపముఖ్యమంత్రి భట్టి
- తాజాగా మరిన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్లు
- రాష్ట్రంలో మరో 30 వేల ఉద్యోగాలను త్వరలో భర్తీ

2

### సీఎం సీరియస్

- ఇన్‌చార్జ్ మంత్రులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి
- నామినేటెడ్ పదవులు ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు
- ఎన్నికల్లో 99 శాతం సీట్లు గెలిచేలా ఇన్‌చార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలన్నారు
- త్వరలోనే మహిళా రిజర్వేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు

2

## కాంగ్రెస్‌లో టిక్కెట్ లొల్లి

- జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం బైపోల్ సమరం
- అధికార కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది
- జూబ్లీహిల్స్ టిక్కెట్ నాదేనంటూ అజహరుద్దీన్
- అదేం కుదరదంటున్న టీపీసీసీ ఛీఫ్
- పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సీరియస్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం బైపోల్ సమరం అధికార కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. అందుకే బరిలోకి దిగేందుకు ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలు మొదలుపెట్టాయి. కాంగ్రెస్ పార్టీలో మాత్రం సీటు లొల్లి ఆదిలోనే పీక్స్ కు చేరుకుంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా నలుగురు కాంగ్రెస్ అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే టిక్కెట్ కోసం లాబియింగ్ మొదలుపెట్టేశారు. ఈసారి

మిగతా 2లో



### 629 కిలో మీటర్లకు హైదరాబాద్ మెట్రో

- హైదరాబాద్ మహానగరం ఔటర్ రింగ్ రోడ్డును దాటింది
- రీజినల్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరిస్తోంది
- హెచ్ఎండీఏ పరిధి 10,472 చదరపు కిలో మీటర్లు పెరగనుంది
- ప్రస్తుతం హైదరాబాద్ జనాభా 1.45 కోట్లు
- 20 ఏళ్లలో ఏకంగా 3 కోట్లకు చేరనుంది

2

## తెలంగాణ తల్లి విగ్రహాలన్నిటినీ తొలగిస్తాం!



- తెలంగాణ తల్లి విగ్రహాలన్నిటినీ తొలగిస్తామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్సీ కవిత
- అవి తెలంగాణ తల్లి విగ్రహాలు కావని, కాంగ్రెస్ తల్లి విగ్రహాలని విమర్శించారు
- ఆ విగ్రహాలన్నిటినీ తీసేసి గాంధీ భవన్‌కి పంపిస్తామని అన్నారు
- అందరి ఉమ్మడి కృషి ఫలితమే తెలంగాణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కలెక్టరేట్ ప్రాంగణాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న తెలంగాణ తల్లి విగ్రహాలన్నిటినీ తొలగిస్తామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్సీ కవిత. అవి తెలంగాణ తల్లి విగ్రహాలు కావని, కాంగ్రెస్ తల్లి విగ్రహాలని విమర్శించారు. ఆ విగ్రహాలన్నిటినీ తీసేసి గాంధీ భవన్ కి పంపిస్తామని అన్నారు. తాము అధికారంలోకి రాగానే ఆ పని మొదలు పెడతామని చెప్పారామె. తెలంగాణపై పేటెంట్ రైట్ తమదేనన్నట్టుగా మాట్లాడుతుంటారు బీఆర్ఎస్ నేతలు. ఉద్యమ కాలంలో బీఆర్ఎస్ తోపాటు అనేక పార్టీలు నిరసనలు, ధర్నాల్లో పాల్గొన్నాయి. అందరి ఉమ్మడి కృషి ఫలితమే తెలంగాణ. కాంగ్రెస్ సహకారం, చొరవ లేకపోతే తెలంగాణ సాధ్యమేనా అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. తెలంగాణ కల సాకారమైన తర్వాత మాత్రం బీఆర్ఎస్ ఆ క్రెడిట్ అంతా తమదేనంటోంది. అదే తరహాలో ప్రచారం చేసుకుంది కూడా. ఆ భ్రమలోంచి బయటపడేందుకు ప్రజలకు తొమ్మిదేళ్లు టైమ్ పట్టింది. తెలంగాణ పేరుని రాజకీయం కోసం వాడుకుని బాగుపడ్డది కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమేననే విషయం ప్రజలు తెలుసుకున్నారు కాబట్టే 2023లో కాంగ్రెస్ ని గద్దెనెక్కించారు. దీంతో బీఆర్ఎస్ ఒంటెత్తు పోకడలకు బ్రేక్ పడింది. తెలంగాణ

మిగతా 2లో

# తెలంగాణ తల్లి విగ్రహాలన్నిటినీ తొలగిస్తాం!

మొదటి పేజీ తరువాయి

తల్లి విగ్రహం విషయంలో కూడా కాంగ్రెస్ ప్రజాభిప్రాయంతో ముందుకొచ్చింది. తెలంగాణ తల్లి ఒక సామాన్య మహిళగా, ఆర్భాటాలకు తావులేకుండా ప్రభుత్వం కొత్త రూపాన్నిచ్చింది. ఆ విగ్రహం బీఆర్ఎస్ కి నచ్చలేదు. ఇక్కడ నచ్చనిది బీఆర్ఎస్ కి మాత్రమే, తెలంగాణ ప్రజలకు కాదు. కానీ బీఆర్ఎస్ కి నచ్చకపోతే ప్రజలకు కూడా నచ్చలేదన్నట్టుగా సీన్ క్రియేట్ చేస్తున్నారు ఆ పార్టీ నేతలు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న విగ్రహాలన్నిటినీ తొలగిస్తామంటూ కవిత చేసిన వ్యాఖ్యల్ని నెటిజన్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. మరీ ఇంత అహంకారమా అని ప్రశ్నిస్తున్నారు. కలెక్టరేట్లలో ప్రభుత్వం పెట్టాలనుకుంటున్న విగ్రహం తెలంగాణ తల్లిది కాదు. ఆమె కాంగ్రెస్ తల్లి. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఆ విగ్రహాలన్నీ గాంధీ భవన్ కు తరలిస్తాం. మళ్లీ తిరిగి అధికారంలోకి వచ్చేది తామేనని సెలవిస్తున్నారు కవిత. మెడలో జాగృతి జెండా వేసుకున్న కవిత ఏ పార్టీ గురించి మాట్లాడుతున్నారు. దెయ్యాలున్న పార్టీ అంటూ నిన్న మొన్నటి వరకూ బీఆర్ఎస్ ని తిట్టారు, కేసీఆర్ ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు, సొంత కుంపటి పెట్టుకున్నారు, సొంత జెండా, సొంత కండువాలతో హడావిడి చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ మాదే అధికారం అంటున్నారు కవిత. ఈ వ్యాఖ్యల అంతరార్థమేంటో తేలాల్సి ఉంది. విగ్రహాల రాజకీయంలో కవిత దిట్ట అని మండిపడుతున్నారు నెటిజన్లు. 9 ఏళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని ఎప్పుడూ కవిత మాట్లాడలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆమెకు బీసీలు గుర్తొచ్చారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలనే డిమాండ్ మొదలు పెట్టారు. తొమ్మిదేళ్లుగా మీరేం చేస్తున్నారు అని ప్రజలు ప్రశ్నిస్తే మాత్రం ఆమె నుంచి సమాధానం ఉండదు. లిక్కర్ స్కామ్ లో జైలుకెళ్లొచ్చిన తర్వాత ఆమెలో అభద్రతా భావం మరింత పెరిగింది. పార్టీలో తన ప్రాధాన్యం తగ్గుతుందనే అనుమానం మొదలైంది. అన్న-చెల్లెలు మధ్య దూరం పెరిగింది. బీఆర్ఎస్ అంతర్గత పోరు ఆసక్తికరంగా మారింది. జాగృతి పేరుతో సొంత కుంపటి పెట్టుకుని మరీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు కవిత. మరోసారి విగ్రహాల రాజకీయం మొదలు పెట్టారు.

## కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్



**హైదరాబాద్:** దమ్ము, ధైర్యం లేక తమ ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో తమ ఫోన్లు ట్యాప్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో భాజపా చాలా చోట్ల ఓడిపోయిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు నత్తనడక సాగుతోందని, బిజెపి, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వేగం లేదని అన్నారు. ప్రభాకర్ రావు నిబంధనలు అతిక్రమించి మాజీ సిఎం కెసిఆర్ కోసం పని చేశారని ఈటల రాజేందర్ ఆరోపించారు.

# 16 ఏళ్లకే ప్రేమ.. తల్లిని చంపిన కూతురు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ శివారులోని జీడిమెట్లలో జరిగిన తల్లి అంజలి హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దారుణానికి పాల్పడిన పదో తరగతి బాలిక, చారిత్రక తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మునిమనవరాలు అని తెలియడం అందరినీ షాక్‌కు గురిచేస్తోంది. పోలీసుల దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. 8 నెలల క్రితం బాలికకు నల్గొండకు చెందిన శివ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. తమ పదో తరగతి వయసులో ప్రేమ ఏంటని తల్లి అంజలి మందలించడంతో, వారం రోజుల క్రితం బాలిక శివతో కలిసి వెళ్లిపోయింది. అయితే, కేవలం మూడు రోజుల క్రితమే ఆమె తిరిగి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలోనే, తమ ప్రేమకు అడ్డుగా ఉన్న తల్లిని తొలగించుకోవాలని బాలిక తన ప్రియుడు శివతో కలిసి హత్యకు స్కెచ్ వేసింది. పథకం ప్రకారం, నిన్న సాయంత్రం నల్గొండ నుంచి శివ వచ్చాడు. ఇంట్లో అంజలి పూజ చేస్తుండగా, శివ వెనుక నుంచి ఆమెపై దాడి చేసి బెడ్‌షీట్‌తో ముఖాన్ని కప్పాడు. ఆ తర్వాత, స్వయంగా కూతురే సుత్తితో తల్లి తలపై కొట్టగా, శివ తమ్ముడు యశ్వంత్ కత్తితో అంజలి పీక కోసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే, ఈ దారుణానికి ప్రత్యక్ష సాక్షి అయిన నిందితురాలు తేజశ్రీ చెల్లె ప్రియ చేసిన వాంగ్మూలం మరింత భయానక విషయాలను వెలుగులోకి తెచ్చింది. చిన్న కూతుతరు ప్రియ మాట్లాడుతూ.. ట్యూషన్ నుంచి వస్తున్న నన్ను మా అక్క గల్లీలోనే ఆపింది. అమ్మ ఒక ఆంటీని తీసుకుని





రమ్మంది. పదా వెళ్దాం అని తీసుకెళ్లిందని తెలిపింది. 20 నిమిషాల తర్వాత తాము ఇంటికి చేరుకోగా, అప్పటికే కిచెన్‌లో అమ్మ స్పృహ లేకుండా పడి ఉందని పేర్కొంది. అమ్మను నేను చూసుకుంటా.. నువ్వు బయటకు వెళ్లి మీ ఫ్రెండ్ ఎవరినైనా తీసుకుని రా.. గల్లీలో ఆంటీ వాళ్లకు ఎవరికీ చెప్పకు అని అక్క చెప్పిందని వెల్లడించింది. అంతేకాకుండా, మా అమ్మ ఇంకా చనిపోలేదు అని తెలుసుకున్న అక్క... మళ్లీ శివకు కాల్ చేసింది. అమ్మ ఇంకా చనిపోలేదు. కాళ్లు చేతులు ఆడిస్తోందని చెప్పింది. మళ్లీ శివ, యశ్వంత్ వచ్చారు. సుత్తితో అమ్మ తలపై కొట్టారు... చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత వెళ్లిపోయారని ప్రియ చెప్పింది. నేను అప్పుడే వచ్చాను. చూసేసరికి అమ్మ రక్తపుమడుగులో పడి ఉంది. వెళ్లి చేతులు రుద్దాను.. లేపే ప్రయత్నం చేశాను. కానీ అక్క మాత్రం దగ్గరికి కూడా రాలేదు. అమ్మ చనిపోయింది, లేపి వేస్ట్ చెప్పిందని ప్రియ వివరించింది.

# కాంగ్రెస్‌లో టిక్కెట్ లొల్లి

మొదటి పేజీ తరువాయి

కూడా జూబ్లీహిల్స్ టిక్కెట్ నాదేనంటూ అజహరుద్దీన్ ప్రకటించేశారు. అజహరుద్దీన్ గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్‌పై పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి అలా కాదు గట్టిగా ప్రచారం చేస్తా, నేనే గెలుస్తానంటూ సీటు ప్రకటించకముందే స్వీట్లు పంచేస్తున్నారు. అజహరుద్దీన్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందిస్తూ అదేం కుదరదు. ఇంకా ఎమ్మెల్యే టిక్కెట్ ఎవరికివ్వాలో అధిష్టానం నిర్ణయం తీసుకోలేదంటూ అజహరుద్దీన్ వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ నేతలు టికెట్‌పై ప్రకటనలు చేస్తుండటంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సీరియస్ అయినట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని మీనాక్షి హెచ్చరించారని సమాచారం .ఇదిలా ఉంటే పీజెఆర్ కూతురు విజయారెడ్డి సైతం జూబ్లీహిల్స్ సీటు కోసం వాయువేగంతో దూసుకుపోతున్నారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలైన విజయారెడ్డి, తన ప్రత్యర్థి దానం కాంగ్రెస్‌లోకి రావడంతో, ఆమెకు ఇప్పుడున్న ఏకైక ఆప్షన్ జూబ్లీహిల్స్. అందుకే గట్టి లాబీయింగ్ మొదలుపెట్టేశారు. తన తండ్రి చరిష్మాతో జూబ్లీహిల్స్ ఇలాకాలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ సామాజికవర్గం ప్రభావం ఎక్కువగా ఉండే జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే సీటు తనకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నేత నవీన్ యాదవ్ డిమాండ్ చేస్తున్నారు. ఎంఐఎంతో కూడా సత్సంబంధాలు ఉండటంతో సీటిస్తే గెలుపు పక్కా అంటూ అధిష్టానికి హామీ ఇస్తున్నారు. ఇదిలా ఉంటే జూబ్లీ హిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరు కూడా తెరపైకి వచ్చింది. తాను మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, తన భార్య శ్రీదేవి యాదవ సామాజిక వర్గం కావడంతోపాటు గతంలో మేయర్‌గా చేసిన అనుభవం, గ్రేటర్ పరిధిలోని పరిచయాలతో తన గెలుపు నల్లేరుమీద నడకేనని, సీటు ఇచ్చి చూడండి అంటూ కాంగ్రెస్ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు బొంతు రామ్మోహన్. మరి నలుగురు అభ్యర్థులు పోటీ పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ హైకమాండ్ జూబ్లీహిల్స్ టికెట్ ఎవరికి ఇస్తుందో వేచి చూడాలి.

# త్వరలో మరో 30 వేల ఉద్యోగాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వం కీలక అప్‌డేట్ ఇచ్చింది. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటికే 56 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క .. తాజాగా మరిన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మరో 30 వేల ఉద్యోగాలను త్వరలో భర్తీ చేయనున్నట్లు భట్టి స్పష్టం చేశారు. నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను కూడా ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తేల్చి చెప్పారు. ప్రతి పాఠశాలను 25 ఎకరాల్లో.. రూ.200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నామని వివరించారు. మొదటి సంవత్సరం 58 పాఠశాలలు నిర్మించేందుకు రూ.11,600 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలో రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం ఇస్తున్న విషయాన్ని కూడా భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ఉగాది పండగ నుంచి తెలంగాణ ప్రజలకు రాష్ట్రవ్యాప్తంగా 3.10 కోట్ల మంది పేదలకు సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తేల్చి చెప్పారు. ప్రతి సంవత్సరం సన్న బియ్యం కోసం రూ.13,525 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందని వివరించారు. తెలంగాణలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇందుకుగాను తాజాగా బడ్జెట్‌లో రూ.23,373 కోట్లు కేటాయించమని లెక్కలతో సహా వివరించారు. ఇక కాంగ్రెస్ పార్టీ అంటే వ్యవసాయం అని.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ పార్టీ అని భట్టి విక్రమార్క తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లను పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. రైతు భరోసా మూలంగా రాష్ట్రంలో సాగుకు యోగ్యమైన 1.49 కోట్ల ఎకరాలకు 69.70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.9 వేల కోట్లు వేశామని స్పష్టం చేశారు. సన్నధాన్యం సాగు చేస్తున్న రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ రూపంలో ఇప్పటివరకు రూ.1,199 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. రైతు బీమా పథకం కింద 42.16 లక్షల మంది రైతులకు బీమా అందించినట్లు చెప్పారు. ఇక రాష్ట్రంలో రూ.22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టినట్లు భట్టి తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 10 లక్షల వరకు వైద్య సహాయం చేస్తున్నామని.. 94 లక్షల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్ల ఉచిత బస్సు టికెట్లను ఇచ్చినట్లు స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నామని.. మొత్తం రాష్ట్రంలో అమలయ్యే సంక్షేమ కార్యక్రమాల కోసం రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.

## 629 కిలో మీటర్లకు హైదరాబాద్ మెట్రో

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగరం ఔటర్ రింగ్ రోడ్డు దాటి రీజినల్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరిస్తోంది. హెచ్ఎండీఏ పరిధి కూడా 7257 చదరపు కిలో మీటర్ల నుంచి 10,472 చదరపు కిలో మీటర్లు పెరగనుంది. ప్రస్తుతం హైదరాబాద్ జనాభా 1.45 కోట్లు ఉండగా వచ్చే 20 ఏళ్లలో ఏకంగా 3 కోట్లకు చేరనుందని హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అంచనా వేస్తోంది. ఈ దశలో ప్రజా రవాణాపై తెలంగాణ సర్కారు దృష్టి సారిస్తోంది. 2050 నాటి అవసరాలకు తగ్గట్టు ఇప్పటికే మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగమైన కాంప్రెన్సివ్ మొబిలిటీ ప్లాన్(సీఎంపీ)ను రూపొందిస్తోంది. ప్లానింగ్‌లో భాగంగా మూడు రిపోర్టులను సిద్ధం చేస్తున్నారు. ఎస్టిమేట్ పబ్లిక్ టాన్స్‌పోర్టు నివేదికను ప్రస్తుతం పూర్తి చేశారు. ఆగస్టులో పూర్తి సీఎంపీ రిపోర్టు అందనుంది. హైదరాబాద్ ప్రజా రవాణాలో టీజీఎస్ ఆర్టీసీ కీలకంగా వ్యవహరిస్తోంది. రోజూ 10 నుంచి 15 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. మెట్రోలో మరో 4 నుంచి 5 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. నగరంలో మూడు కారిడార్లలో కలిపి ప్రస్తుతం 69 కిలో మీటర్లు మాత్రమే హైదరాబాద్ మెట్రో పొడవు ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే 20 ఏళ్లలో హైదరాబాద్‌లో భారీగా మెట్రోను విస్తరించడం అవసరమని తాజాగా సీఎంపీ అంచనా వేసింది. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధి వరకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజారవాణాలో భాగంగా మైనర్, మీడియం, లాంగ్ టర్మ్ అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు. తక్షణ అవసరాలకు రోడ్లు, ఫ్లైఓవర్లు, జంక్షన్లను వేగంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులకు సంబంధించి ప్రత్యేక సమగ్రమైన నివేదికలను తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. సీఎంపీలో భాగంగా 2050 వరకు మెట్రో సేవలు 629 కిలో మీటర్ల వరకు విస్తరించాలనదే ఆలోచన. ఫేజ్-2లో 74, ఫేజ్2బీలో మరో 86 కిలోమీటర్లకు ఇప్పటికే ప్లానింగ్ సిద్ధమయ్యింది.



# కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం

**9రోజుల్లో 9 వేల కోట్లు రైతు ఖాతాలో జమ**

**రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాం**

**రైతు భరోసా విజయోత్సవ సభలో డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్:** కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా మూలంగా రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1.49 కోట్ల ఎకరాలకు 69.70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 9 వేల కోట్లు వేశామని చెప్పారు. సన్నధాన్యం సాగు చేస్తున్న రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ రూపంలో ఈరోజు వరకు 1,199 కోట్ల రూపాయలు రైతులకు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. రైతన్నకు ఊహించని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు రైతు బీమా పథకాన్ని అమలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ పథకం కింద 42.16 లక్షల మంది రైతులకు భీమా అందించామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ది పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం అని చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఇప్పటికే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని.. మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయనున్నామని స్పష్టం చేశారు. 'నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రతి పాఠశాల 25 ఎకరాల్లో.. 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం. మొదటి సంవత్సరం 58 పాఠశాలలు నిర్మించేందుకు 11,600 కోట్లు కేటాయించాంరాష్ట్రంలోని 3.10 కోట్ల మంది పేదలకు ఉగాది నుంచి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. సన్న బియ్యం కోసం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుంది. రాష్ట్రంలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇందుకుగాను తాజా బ్జడెట్లో 23,373 కోట్లు కేటాయించాం.' అని భట్టి వ్యాఖ్యానించారు. దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లికించదగ్గ రోజు, ఈరోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

# సీఎం సీరియస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇన్‌చార్జ్ మంత్రుల పనితీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా జిల్లాల్లో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులకు అప్పగించినా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం సీట్లు గెలిచేలా ఇన్‌చార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు నిధులు ఇచ్చామని, వాటిని సరిగ్గా ఎందుకు ఆయా జిల్లాల్లో ఉపయోగించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే.. మంత్రి పదవుల కోసం కొంతమంది కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేయించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని హెచ్చరించారు. పదవులు వచ్చినవారు తెలంగాణ రాష్ట్రమంతా తిరగాలని ఆదేశించారు. పదవులు అడగటం తప్పు లేదు.. కానీ నిరసన హుందాగా ఉండాలని సూచించారు. పీసీసీ కార్యవర్గంలో ఉన్న వారిని రెండుగా చేసి జాబితా సిద్ధం చేయాలని.. ముందు అందరికీ పని అప్పగించాలని ఆదేశించారు. పని చేసిన వాళ్లది ఒక జాబితా, పనిచేయని వాళ్లది మరో జాబితా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పని చేయకపోతే డిమోషన్.. పని చేస్తే ప్రమోషన్ ఇస్తామని స్పష్టం చేశారు. పని చేయకపోతే పక్కన పెట్టడంలో మొహమాటం అవసరం లేదని తేల్చిచెప్పారు. గతంలో తాను టీపీసీసీ చీఫ్ అయిన తర్వాత ఫ్రంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ బాధ్యతలు తీసుకోమంటే కొందరు నేతలు తీసుకోలేదని గుర్తుచేశారు. తాము సీనియర్లం, ఆ చిన్న బాధ్యత తీసుకోమని తనకు ఆ నేతలు చెప్పారని అన్నారు. ఆ రోజు బాధ్యత తీసుకున్ననాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేషన్ పదవులు ఇచ్చామని స్పష్టం చేశారు. పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం అయితే పదవులు వాటంతటవే వస్తాయని ఉద్ఘాటించారు. ఇంకో నాలుగు సంవత్సరాలు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని అన్నారు. త్వరలోనే మహిళా రిజర్వేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. 2029 ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. పార్టీలో పనిచేయని వారిని పదవుల నుంచి తొలగించాలని ఆదేశించారు. తెలంగాణలో కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి రావాలంటే.. పార్టీ నేతల పనితీరుపైనే ఆధారపడి ఉందని తేల్చిచెప్పారు. పదేళ్లు అధికారం మనదేనని స్పష్టం చేశారు. పార్టీ పదవిని చిన్నచూపు చూస్తే వారికే నష్టమని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వం జోడెద్దుల్లాలాగా పనిచేయాలని సూచించారు. 18 నెలల ప్రభుత్వ పాలన గోల్డెన్ పీరియడ్ అని అభివర్ణించారు. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. బూత్ స్థాయిలో



పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లగలుగుతామని ఉద్ఘాటించారు. పార్టీ నిర్మాణంపైన టీపీసీసీ దృష్టి సారించాలని అన్నారు. పార్టీ నాయకులంతా ఐక్యంగా పని చేయాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా నేతలు అందరూ కలిసి పని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు గ్రౌండ్ లెవెల్లో పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పని చేస్తేనే పదవులు వస్తాయని చెప్పారు. పార్టీకి కష్టకాలంలో పనిచేసిన వారికి పదవులు ఇచ్చామని ఉద్ఘాటించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీలు, టెంపుల్ కమిటీల వంటి నామినేటేడ్ పోస్టులు భర్తీ చేసుకోవాలని ఆదేశించారు. పార్టీ నాయకులు క్రమశిక్షణతో వ్యవహారించాలని కోరారు. మన ప్రభుత్వం చాలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఉద్ఘాటించారు. అనేక సామాజిక అంశాలను కూడా ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో చాలా సవాళ్లు ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, జమిలి ఎన్నికలు లాంటి అంశాలు మన ముందుకు రాబోతున్నాయని వెల్లడించారు. తాను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

బుధవారం
25.06.2025
హైదరాబాద్

3

epaper:vishalabharati.com
www.vishalabharati.com

GENERAL NEWS



# బెట్టింగ్ యాప్స్ ప్రమోటర్ల అరెస్ట్

## పరారీలో ప్రధాన నిందితులు

## సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయిశ్రీ వెల్లడి

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

సోషల్ మీడియా టెలిగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్లు, అనధికార బెట్టింగ్ వెబ్‌సైట్‌లు,మ్యూల్ ఖాతాల ద్వారా పనిచేస్తున్న అధునాతన ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ సిండికేట్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్టు అదుపులోకి తీసుకున్నారు.ఈ నెట్‌వర్క్ మ్యాచ్ ఫిక్సింగ్ చిట్కాల హామీలతో యువతను మోసం చేసింది. లక్షలాది మందిని అక్రమ జూదం వైపు ఆకర్షించడానికి దూకుడుగా సోషల్ మీడియా ప్రచారాలను ఉపయోగించింది. అరెస్టయిన వారిని చిన్నంశెట్టి నాగ రాకేష్, పొట్టవతిని దీపక్, గుగులోత్ శ్రీరామ్ నాయక్, హేమంత్ కుమార్‌గా గుర్తించారు. రాకేష్, హేమంత్ కుమార్ ఐసిసి క్రికెట్ విశ్లేషకులమని చెప్పుకుని నమ్మకాన్ని సంపాదించి వారిని మోసం చేసేవారు. జూన్ 13న, టెలిగ్రామ్ ఛానెల్‌లలో హామీ ఇచ్చి "టాస్ ఫిక్స్" అంచనాల ద్వారా మోసపోయిన మియాపూర్ నివాసి నుండి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారుడు,అతని స్నేహితుడు రూ.50 లక్షలు,రూ.60 లక్షలు కోల్పోయారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుండి నాలుగు ప్రత్యేక బృందాలను మోహరించి నలుగురిని అరెస్టు చేశారు.

## పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి

**దేవరుప్పుల, విశాలభారతి:**



ఇటీవల ప్రమాదవశాత్తు కింద పడి గాయపడిన జనగామ ఎమ్మెల్యే డాక్టర్.పల్లా రాజేశ్వర్ రెడ్డి హైద్రాబాద్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొంది వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా.. వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించి త్వరగా కోలుకొని తిరిగి ప్రజా క్షేత్రంలోకి రావాలని,అంకిత భావంతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. వారి వెంట జనగామ జిల్లా బిఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,దేవరుప్పుల మండల సీనియర్ పాత్రికేయులు ఈటూరి విజయ్ కుమార్.

# పల్లెల కడుపు నింపుతున్న ఉపాధి హామీ

**రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి**

**గత రెండు నెలల్లోనే 4.54 కోట్ల పని దినాలు పూర్తి అయ్యాయి**

**6.50 కోట్ల పనిదినాలను కేటాయించిన కేంద్రం**

**70శాతం పూర్తి చేసిన ప్రభుత్వం**

**మిగిలిన 30శాతం ఈ నెలాఖరుతో పూర్తి**

**2025-2026 ఆర్థిక సంవత్సరానికి 12 కోట్ల పని దినాలు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. గత రెండు నెలల్లోనే 4.54 కోట్ల పని దినాలు పూర్తి అయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన 6.50 కోట్ల పనిదినాల లక్ష్యంలో సుమారు 70శాతం పూర్తి చేయడం ద్వారా అత్యధిక మందికి ఉపాధి కల్పించినట్లు అయిందని, మిగిలిన 30శాతం ఈ నెలాఖరుతో పూర్తి అవుతాయని అంచనా వేస్తున్నామని అధికారులు తెలిపారు. తెలంగాణ గత నాలుగు సంవత్సరాలుగా సరాసరిన సంవత్సరానికి 10 కోట్లకు పైగా పని దినాలు పూర్తి చేస్తూ వస్తున్న నేపథ్యంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 12 కోట్ల పని దినాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. కానీ కేంద్ర ప్రభుత్వం 6.50 కోట్లే కేటాయించింది.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గత 2 నెలల్లో 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మంది కూలీలకు పని కల్పించారు. ఒక్కో కుటుంబం సగటున 24 రోజుల పని దినాలు, 1,127 కుటుంబాలు 100 రోజుల పని దినాలు పూర్తి చేశాయి. సగటున ఒక్కో కూలీకి రోజువారీ వేతనంగా రూ.250.75 వచ్చింది.గత నెల ఆఖరుకు పూర్తి అయిన వాటిలో వ్యవసాయ అనుబంధ పనులు యాభై శాతంగా నమోదు అయ్యాయి. పశువుల కొట్టాలు, నీటి కుంటలు, మొక్కలు నాటడం వంటి లక్షకు పైగా పనులు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర 1.31 లక్షల పనులు పురోగతిలో ఉన్నాయి. మే నెలాఖరు నాటికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1,416 కోట్లు ఖర్చు అయ్యాయి. అందులో రూ.1151.67 కోట్లు వేతనాల రూపంలో, రూ.191.03 కోట్లు సామగ్రి కోసం వ్యయం అయింది అని సంబంధిత అధికార వర్గాలు పేర్కొన్నాయి.ఈ నెలలోనే 20వ తేదీ నాటికి 1.50 కోట్ల మేరకు పని దినాలు పూర్తి అయ్యాయి. నెలాఖరుకు మరో యాభై లక్షల పని దినాలు కల్పించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే కేంద్రం నిర్దేశించిన 6.50 కోట్ల పని దినాల లక్ష్యం ఈ నెలాఖరుకు పూర్తికానుంది. ఆ తరువాత చేపట్టే పనులకు కేంద్రం ప్రభుత్వ అనుమతి ఉండదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం అయింది. పని దినాలను 12 కోట్లకు పెంచాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క త్వరలో దిల్లీకి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రికి లేఖ రాసే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# బండారు దత్తాత్రేయని మర్యాద పూర్వకంగా కలిసిన కార్పొరేటర్ కళ్లెం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయని మంగళవారం ఉదయం వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి వారు రచించిన ఆత్మకథ ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాన్ని వారి చేతుల మీదుగా ఎందుకోవడం జరిగింది. అని హాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు



## నల్ల ఆండాలు శ్రీరామ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని

**దేవరుప్పుల, విశాలభారతి:**

కొడకండ్ల మండల ఏఎంసీ చైర్మన్ నల్ల ఆండాలు తల్లి,దేవురుప్పల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అత్త ఇటీవల అనారోగ్యంతో మరణించారు. హైద్రాబాద్ లోని రామ్ నగర్ లో ఉన్న వారి ఇంటికి వెళ్ళి వారి చిత్రపటానికి పూలు చల్లి నల్ల ఆండాలుశ్రీరామ్ ను,వారి కుటుంబ సభ్యులను పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పరామర్శించారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు




**వాజేడు, విశాలభారతి:**

వాజేడు మండల కేంద్రంలో రాంపురం గ్రామంలో కాఫెడు స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో రైతులకు సీజనల్ పంటలు మరియు ప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే సబ్సిడీలు పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీసీ కంపెనీ నుండి రంగు సంపతు పాల్గొన్నారు. సంపత్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం క్రింద పంట నష్టపోయిన రైతులకు ఆర్థికంగా సాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పంటల భీమా పథకాన్ని ప్రారంభించింది ఈ స్కీమ్ కోసం విపత్తు తెగుళ్ళ కరువు కారణంగా పంటలు దెబ్బతిన్నపుడు భీమా పథకం క్రింద ఆర్థిక సహాయం అందచేస్తారు అని తెలియ చేశారు. కిసాన్ క్రెడిట్ కార్డు గురుంచి తెలియ చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి వాజేడు మండల కోఆర్డినేటర్ కామేష్ వెంకటాపురం మండల కోఆర్డినేటర్ హనుమంతు యానిమేటర్స్ సిహెచ్ రమాదేవి, సిహెచ్ భాస్కర్, పొడెం స్వరూప, ప్రసాదు,గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఇండోర్ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకురండి

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

మైలార్దేవుపల్లి డివిజన్ కాటేదాన్ లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకురావాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి కాటేదాన్ లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను పరిశీలించారు. వారం లోపల ఇండోర్ కాంప్లెక్స్ ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా స్కేటింగ్ ట్రాక్ కు మరమ్మతులు చేయాలని సూచించారు. అదేవిధంగా స్విమ్మింగ్ పూల్ ను కూడా వినియోగంలోకి తేవాలన్నారు. ఈ విషయంలో వెంటనే దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవికుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



# అన్నదాతల పక్షాన నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం

**తొర్రూరు, విశాలభారతి:**

అన్నదాతలకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులు విడుదల చేసి వారి పక్షాన నిలిచిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు.రైతు భరోసా నిధులు విడుదల చేయడానికి హర్షిస్తూ తొర్రూరు డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రెవిన్ శాఖ మంత్రి కొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేసిన విధానం హర్షనీయమన్నారు. ఎలాంటి పరిమితులు, షరతులు విధించకుండా వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న మొత్తం విస్తీర్ణానికి పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు.ఈ మేరకు కోటిన్నర ఎకరాలకు.. ఎకరానికి రూ.6 వేల చొప్పున చెల్లించడానికి రూ.9 వేల కోట్ల నిధులు విడుదల చేయడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు పింగిలి ఉష,పిఎసిఎస్ డైరెక్టర్లు కందాడి అచ్చిరెడ్డి, సొంటి రెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, నాయకులు పేరటి యాకూబ్ రెడ్డి, గుండాల నర్సయ్య,నల్లపు రాజు, వెన్నెం సోమిరెడ్డి, కాసర్ల రంగయ్య, గూడెల్లి రామచంద్రయ్య, అజ్మీర రమేష్, తోట అశోక్, సహదేవ్, అంకుష్, వెలుగు మహేశ్వరి,అనిత, పాడియా రమేష్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖతార్ పోలీసుల అదుపులో ఆర్మూర్ వాసి

**నెల రోజులుగా జాడలేని వైనం**

**కాన్సులార్ యాక్సెస్, లీగల్ ఎయిడ్ కోసం వినతి**





**నిజామాబాద్, విశాలభారతి:**

ఆర్మూర్ పట్టణం కాశీ హనుమాన్ గల్లీకి చెందిన కానూర్ నాగరాజు ఖతార్ లో అదృశ్యం అయ్యాడని, చూకీ కనుగొనాలని అతని తండ్రి కానూర్ నారాయణ మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్ లో ప్రవాసీ ప్రజావాణి' లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. ఎదో క్రిమినల్ కేసు విచారణ కోసం పోలీసుల అదుపులో ఉన్నట్లు అనుమానంగా ఉన్నదని ఆయన తెలిపారు. ప్రవాసీ ప్రజావాణి కౌంటర్ ను సందర్శించిన జీఏడి ఎన్నారై విభాగం అధికారులు శ్రీనివాస రెడ్డి, ఇ. చిట్టిబాబు లకు నారాయణ తన గోడు వెళ్ళ బోసుకున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి లు చొరవ చూపాలని వారికి అభ్యంధనలు పంపారు. సెలవుపై ఇండియాకు వచ్చిన నాగరాజు ఆరు నెలల క్రితం ఖతార్ కు వెళ్లి స్టార్క్ సెక్యూరిటీ సర్వీసెస్ లో తిరిగి విధుల్లో చేరారని, గత నెల 26 నుంచి ఫోన్ లో అందు బాటులో లేదని నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. దోహా, ఖతార్ లోని ఇండియన్ ఎంబసీ ద్వారా 'కాన్సులార్ యాక్సెస్' (విదేశంలో అరెస్టు చేయ బడినప్పుడు దౌత్య అధికారుల నుండి సహాయం పొందే హక్కు) కల్పించాలని, న్యాయ సహాయం (లీగల్ ఎయిడ్) అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
బుధవారం
25.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily




# తాళంవేసి ఉన్న ఇంట్లో బంగారం చోరీ

### ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ లోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో బంగారం, నగదు తో పాటుగా ఐపాడ్, ఐ ఫోన్ చోరీ జరిగింది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమరౌతు శ్రీలక్ష్మి తుర్కయాంజాల్ లో నివాసం ఉంటుంది. ఏప్రిల్ నెలలో అమెరికా వెళ్ళింది. అక్కడే రెండు నెలలు ఉండింది. అమెరికా నుండి ఇంటికి వచ్చిన ఆమె ఇంటికి తాళాలు పగులగొట్టి ఉండడంతో బీరువా వద్దకు వెళ్లి చూడగా అందులోని 20 తులాల బంగారం, నగదు , ఐఫోన్, ఐప్యాడ్ ల చోరీ జరిగినట్టు గ్రహించింది. దీని విలువ దాదాపు రూ. 9 లక్షలకు పైగా ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె మంగళవారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.



# పార్టీ అభివృద్ధికి పని చేయాలి

### బిజెపి నేత బాలాజీ సూర్య వంశీ

**రాజేంద్రనగర్, విశాలభారతి:** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేతలు పార్టీ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని కార్వాన్ నియోజకవర్గం నానల్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు బాలాజీ సూర్య వంశీ సూచించారు. డివిజన్లో వివిధ మోర్చాలకు ఆయన మంగళవారం అధ్యక్షులను నియమించారు. ఎస్సీ మోర్చా ప్రెసిడెంట్ గా విద్యాసాగర్, ఓబీసీ మోర్చా ప్రెసిడెంట్ గా రాజేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా అనురాధ, యువ మోర్చా అధ్యక్షుడిగా వెంకటేష్, అదేవిధంగా మైనార్టీ మోర్చా అధ్యక్షురాలిగా మియాబాయ్ ని నియమించి ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ సూర్య వంశీ మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి అమర్ సింగ్, పలువురు నేతలు పాల్గొన్నారు.

# బిల్లు లేకుండా ఫోన్ కొనకండి

### పోయిన సెల్ ఫోన్ ఆన్ కాగానే పట్టేస్తాం

### రాచకొండ సీపి సుధీర్ బాబు



**నేరెడ్మెట్, విశాలభారతి:** కొత్తదయినా, పాతదయినా, బిల్లు లేకుండా, అగ్వకు సెల్ ఫోన్ లను కొనవద్దు, అలా చేయడం ద్వారా నేరాలు, ఘోరాలు జరిగే అవకాశముందని, సెల్ ఫోన్ ఆన్ కాగానే పట్టేస్తామని రాచకొండ సీపి సుధీర్ బాబు తెలిపారు. మంగళవారం నేరెడ్మెట్లోని రాచకొండ సీపీ ఆఫీస్ లో జరిగిన మీడియా సమావేశంలో సీపి సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. ఈ మధ్య కాలంలో సెల్ ఫోన్ లు పోగొట్టుకున్నవారు, వారి ఫోన్ లు దొంగలించపడ్డవారు పోలీసులకు కంప్లైంట్ చేయకుండా ఉండడం వల్ల అనేక రకమైన నేరాలు జరిగే అవకాశముందని రాచకొండ సీపి సుధీర్ బాబు హెచ్చరించారు. రాచకొండ కమీషనరేట్ లిమిట్స్ లో సుమారు 3.5 కోట్ల విలువ చేసే 1130 మొబైల్ ఫోన్ లను సీసీఎస్ పోలీసులు ఎల్బి నగర్ లో 706, మల్కాజిగిరిలో 312, భువనగిరిలో 112 ఫోన్ లను, ఈ సంవత్సరం గడచిన నెలల్లో సీఈఐఆర్ సాఫ్ట్వేర్ ద్వారా మొత్తం3694 ఫోన్ లను రికవరి చేశామని సీపి తెలిపారు. ఎవ్వరైనా ఇంటి నుండి భయటకు వెళ్లినప్పుడు ప్రతి ఒక్క వస్తువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెల్ ఫోన్ లు పోగొట్టుకున్నవారు, దొంగిలించబడ్డవారు తమ సెల్ ఫోన్ లను పోలీసు అధికారులు తమకు అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో క్రైం డీసీపి అరవింద్ బాబు, క్రైం ఏసీపి కరున సాగర్, సీసీఎస్, ఐటీ సెల్ ఆఫీసర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# మున్సిపాలిటీలోని వార్డుల సమస్యలను పరిష్కరించాలి

### సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు

**మణుగూరు, విశాలభారతి:** వార్డులలో ప్రధానమైన సమస్యలు పరిష్కరించడంలో మున్సిపాలిటీ అధికారులు వైఫల్యం చెందుతున్నారని సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నాడు స్థానిక సిపిఎం కార్యాలయంలో హమాలి శాఖ,కామ్రేడ్ రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మున్సి పాలిటీ పరిధిలో ఉన్న గ్రామాలు వార్డులలో చెత్తా చెదారం, మంచినీటి సమస్య, వీధిలైట్లు మెయిన్ రోడ్, డ్రైనేజీలు ప్రధానమైన సమస్యలతోటి మున్సిపాలిటీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు మాత్రం ఏమి పట్టినట్టుగా ఉంటున్నారని అన్నారు. మున్సిపల్ లో ఆఫీసులో ఉన్న అధికారులు పరివేక్షణ లోపంతో మణుగూరు మున్సిపాలిటీ కుంటి పడుతుంద న్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టి విద్యా, వైద్యం, ఆరోగ్యం ప్రజల అవసరాలను తీర్చే విధంగా ఉండాలని వారన్నారు.ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, శాఖ కార్యదర్శి ఆర్ శ్రీను సాంబయ్య , అంజి, సోమిరెడ్డి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి సహచరుల ఆపన్న హస్తం

### రూ. 3.20 లక్షలు అందించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు



**తొర్రూరు, విశాలభారతి:** రోడ్డు ప్రమాదంలో అకాలంగా మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆపన్న హస్తం అందించారు. తొర్రూరు వాసి, సి అర్ పి సర్వి రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా తీవ్ర దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి సాయం అందించాలని సంకల్పించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులు తలో చేయి వేసి జమ చేశారు. జమ చేసిన రూ. 3. 20 లక్షలు రమేష్ దశదినకర్మ సందర్భంగా ఆయన నివాసంలో మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. డీఈఓ రవీందర్ రెడ్డి హాజరై ఉద్యోగులు సమకూర్చిన మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సిఆర్పి రమేష్ మృతి విద్యారంగానికి తీరని లోటు అని, ఆయన అంకితభావంతో పనిచేసేవాడని గుర్తు చేశారు. విద్యార్థుల సంఖ్య పెంచడంలో,ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఆయన తోడ్పాటు అందించాడని కొనియాడారు.వారి కుటుంబానికి ఉపాధ్యాయులు సమగ్ర శిక్ష, ఉద్యోగులు ఆర్థిక చేయూత అందించడం ఆహ్వానించదగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, ఉపాధ్యాయ సంఘం బాధ్యులు ముత్తిలింగం కొలుపుల శ్రీనివాస్ తిరుమలేష్ భీమా నాయక్ చైతన్య సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెల్తూరి మల్లేశం,నాయకులు జానకి రామ్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ లోస్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బీహెచ్ఈఎల్ ఎల్ఐజీ కాలనీ లో పారిపెల్లి పవన్ కుమార్(43), భార్య సంధ్యారాణి, ఇద్దరు కూతుర్లతో కలిసి నివాసం ఉంటున్నారు. పని నిమిత్తం పవన్ కుమార్ కొండాపూర్ నుండి మియాపూర్ కు హోండా యూనికాన్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు . ఈ క్రమంలో హఫీజ్పేట్ ఫ్లైఓవర్ వద్ద చిరెక్ స్కూల్ బస్సు నం టీ యస్ 07 యూ హెచ్ 4907 వెనుక నుండి వేగంగా వచ్చి బైక్ ను ఢీకొన్నది.దీంతో తీవ్రగాయాలైన పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రమాదం జరిగిన వెంటనేబస్ డ్రైవర్ బస్సుతో సహా అక్కడి నుండి పారిపోయాడు. ఘటన స్థలికి చేరుకున్న మియాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. ప్రమాదానికి కారణమైన చిరెక్ స్కూల్ యాజమాన్యం తో పాటు బస్ డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని మృతుని బంధువులు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న మియాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# సమర్థవంతంగా పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

### మణుగూరులో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్పై సమీక్ష



**మణుగూరు, విశాలభారతి:** ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా, గ్రామాల్లో పరిశుభ్రతను బలోపేతం చేయడానికి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ అమలుపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మణుగూరు క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమీక్షలో ఎంపీడీవో, ఎంపీఓ, అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యమైన మార్గదర్శకాలను స్పష్టంగా తెలియజేశారు. ప్రతి గ్రామంలో చెత్తను సమర్థవంతంగా తొలగించి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని ఆదేశించారు. ఓపెన్ డ్రెయిన్లు పూర్తిగా శుభ్రపరచి, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓహెచ్ఎస్ఆర్లు, వాటర్ ట్యాంకుల శుభ్రతతోపాటు, పౌరుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. రహదారుల ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల వద్ద గడ్డి, కంప చెట్లను తొలగించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు వంటి వాహనాలను సమర్థవంతంగా వినియోగించి శుభ్రత పనులను వేగవంతం చేయాలని సూచించారు.

# ఎస్బిఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**మణుగూరు, విశాలభారతి:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు శాఖ మేనేజర్ రాసమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటి వారి సౌజన్యంతో మంగళవారం శాఖా కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమి యా, సికిల్ సెల్ ఎనిమియా రోగుల కోసం ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో మణుగూరు మేముసైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అమూల్ శ్రీనివాస్, తమ్మిశెట్టి వాసు, పి జగన్ మోహన్, చిందుకూరి రామారావు, బ్యాంక్ సిబ్బంది, వ్యాపారస్తులు, బ్యాంక్ వినియోగదారులు, మొత్తం 27మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్తదానంతో ఆపదలో ఉన్న వారిని ప్రాణాపాయం నుండి కాపాడవచ్చన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం బ్రాంచ్ మేనేజర్ మనోజ్, జానంపేట బ్రాంచ్ మేనేజర్ ప్రణీత్, టిడిపి సెంటర్ బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, గీద మోహన్ రావు, టిజివిబి బ్రాంచ్ మేనేజర్ విద్యాసాగర్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెంగిచెర్లలో జులై 27న బోనాలు

### ప్రశాంతవాతావరణం బోనాల ఉత్సవలు జరుపుకోవాలి

### కొత్త చెందర్ గౌడ్, కొత్త రవి గౌడ్



**బోడుప్పల్, విశాలభారతి:** తెలంగాణలో అమ్మవారిని పూజించే ఉత్సవం బోనాల పండుగ మన సంస్కృతీ సంప్రదాయాలు కలబోసిన గ్రామదేవతల పండుగిది.రాష్ట్ర పండుగ బోనాల జాతరకు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని చెంగిచెర్ల ముస్తాబవుతోంది. జులై 27న ఆదివారం బోనాల వేడుకలు జరుపుకొనుటకు గ్రామ పెద్దలు,మాజీ కార్పొరేటర్ కొత్త చెందర్ గౌడ్, బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ భర్త, చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్, బోడుప్పల్ కార్పొరేషన్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్త రవి గౌడ్,మాజీ క-ఆప్షన్ సభ్యులు రంగ బ్రాహ్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్ మరియు కుర్రి శివశంకర్, కొత్త శ్రీశైలం గౌడ్, కొత్త గోపాల్ గౌడ్,కొత్త విక్రమ్ గౌడ్, కుర్రి మహేష్, వివిధ కుల సంఘాల పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, కాలనీల ప్రెసిడెంట్లు సెక్రటరీలు తదితరులు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. అనంతరం కొత్త చెందర్ గౌడ్, కొత్త రవి గౌడ్ లు మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా భావించే మన బోనాల పండుగను చెంగిచెర్ల గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

